మైలారం పల్లె నుంచి అమెరికా దాకా
పోరాటమే ఊపిరిగా ఎదిగిన ఓ పేద యువతి ఆత్మకథ

# ...ఐనా, నేను ఓడిపోలేదు!

**జ్యోతిరెడ్డి**
జి.వల్లీశ్వర్‌తో కలిసి

ఎమెస్కో

## 2012 మే 1

హైదరాబాద్‌లో ఒక ప్రముఖ టెలివిజన్ ఛానల్ నన్ను ఇంటర్వ్యూ చేస్తోంది.

"మీకు ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలనిపించింది?"

"నా కుటుంబ పరిస్థితులు..." అంటూ ఎలాంటి దుర్భరమనిపించిన స్థితిలో నేను నా పిల్లలతో సహా చచ్చిపోవాలనుకున్నానో వివరించాను.

...తలుచుకుంటుంటే ఏడుపొస్తోంది. నా కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి.

టి.వి. ఛానల్ Anchor నన్ను సంబాళించుకోమంటున్నాడు.

జరిగింది గుర్తొస్తే ఏడుపొచ్చింది. కాని, ఇంటికొచ్చాక కూడా గత జీవితం వాసనలు వెంటాడతాయనీ, మళ్లీ ఏడవాల్సి వస్తుందనీ అనుకోలేదు!

ఇంటర్వ్యూ చేస్తున్న Anchor అడుగుతున్నాడు-

"అమెరికాలో మీ కంపెనీ టర్నోవర్ 2011లో ఎంత మేడమ్?"

"అయిదు మిలియన్ డాలర్లు (రూ. 25 కోట్లు)..."

జవాబిస్తున్నాను. కానీ గత స్మృతుల్లోంచి ఇంకా తేరుకోలేదు.

ఇంటర్వ్యూ అయిపోయింది.

హైదరాబాద్ సిటీలో నన్ను బాగా అభిమానించే స్నేహితురాలు ఉష దగ్గరికి వెళ్లాను. ఇంటర్వ్యూ గురించి చెప్పాను. చాలా ఆనందపడింది.

"నీ గురించి అందరికీ ఎంత గర్వంగా చెబుతుంటానో తెలుసా?" అంది.

నాకు నవ్వొచ్చింది (?). చాలాసేపు పాత విషయాలు మాట్లాడుకున్నాం. టెలివిజన్‌లో నా ఇంటర్వ్యూ వస్తోంది. చూసుకున్నాను. ఇంటికొచ్చాను. అక్కడ రెడ్డి కూర్చొనివున్నారు. ఆయన కూడా అప్పటికే టెలివిజన్‌లో నా ఇంటర్వ్యూ అంతా చూసినట్లున్నారు. పక్కన ఇంకెవరో వున్నారు.

నన్ను చూస్తూనే రెడ్డి కోపంతో ప్రశ్నల వర్షం కురిపించాడు.

మళ్లీ కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

రెడ్డి నన్ను ప్రశ్నించినందుకు కాదు,

చచ్చిపోవాలనిపించిన నా పాతరోజులు గుర్తొచ్చి.

"నేను ఇంటర్వ్యూ ఇవ్వటంలో తప్పులేదు. అది నా వ్యక్తిగత విషయం, నన్ను ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదు" అన్నాను ఆవేశంగా.

"ఎందుకు లేదు?" అంటూ రెడ్డి ప్రశ్నించాడు.

అవును ఎందుకు లేదు?- నాలోనే ఒకప్రశ్న! నేను ఇప్పుడు అమెరికా దేశస్థురాలైనంత మాత్రాన భారతీయ మహిళకాకుండా పోతానా? భారతీయురాలు అంటే- పురుషాధిక్య సమాజాన్ని గౌరవించి తీరాలికదా!

సమ్మిరెడ్డి నాకు భర్త, నా పిల్లలకి తండ్రి...

★ ★ ★

**1981** లో వినాయక చవితి రోజు.

హన్మకొండలో అనాథ బాలికల హాస్టల్ 'బాలసదన్'లో నేనూ, నాతోపాటు బాల, రామేశ్వరి, శాంతి, పద్మ అమ్మాయిలం కలిసి సూపర్నెంట్‌ని అడిగి, వెయ్యికాళ్ల మంటపం చూసొస్తామని బయల్దేరాం.

కానీ మా అందరికీ మంటపం కన్నా ఎక్కువగా మనస్సులో ఊరిస్తున్నది- కొత్తగా విడుదలైన 'సీతాకోక చిలుక' సినిమా.

కార్తీక్, ముచ్చర్ల అరుణ హీరో, హీరోయిన్‌లు.

ఆ సినిమా చూస్తున్నంతసేపు నన్ను మైకం కమ్మేసింది. సినిమాలో పేద హీరోని బాగా డబ్బున్నఅమ్మాయి ప్రేమించి, పెళ్లి చేసుకుంటుంది.

సినిమా అయ్యేసరికి పేద హీరో స్థానంలో నేనున్నట్లు, నాకోసం ఎవరో బాగా ఆస్తిపరుడైన, అందగాడైన హీరో కారులో ఎక్కి వస్తున్నట్లు, "మాటే మంత్రమూ, మనసే సొంతమూ..." అంటూ మేం డ్యూయెట్ పాడుతున్నట్లు ఊహల్లో తేలిపోయాను.

ఊహ ఎంత అందమైనది!

మనకి ఎలా ఇష్టమో అలాంటి భావనలు, ప్రకృతి, చుట్టూ అందరూ మంచి మనుషులే కనిపిస్తుంటారు ఊహల్లో.

"ఏమిటే ఆలోచిస్తున్నావ్?" నా హాస్టల్ నేస్తం శాంతి అడిగింది.

నా ఊహల గురించి చెప్పాను.

అది నవ్వింది.

"అమ్మానాన్న లేని వాళ్లమని మనకి ఈ హాస్టల్‌లో సీటిచ్చిన్రు. ఈ సీటు లేకపోతే మనం ఈ మాత్రం హైస్కూలు చదువు కూడా చదువుకోలేం. అలాంటి నీ కోసం 'సీతాకోకచిలుక' హీరో లాంటి రాకుమారుడు వచ్చేస్తడా? జర ఎక్కువ చేస్తున్నవ్‌లే?" అంది.

నాకు మనస్సు చివుక్కుమంది.

నా గుండెల్లో ఎవరో చేయిపెట్టి కెలికినట్లనిపించింది. నా 13 ఏళ్ల వయసుకి నేను 'అనాథ'ని అన్న భావన ఆ రాత్రంతా నా మనస్సు తొలిచేస్తోంది. రాత్రంతా ఏడ్చాను.

నా ఏడుపు – అనాథల హాస్టల్‌లో వున్నందుకు కాదు, 'అనాథ'ని కాకుండానే 'అనాథ' అని చెప్పుకోవాల్సి వచ్చినందుకు.

★ ★ ★

**నా**కు అమ్మ వుంది. నాన్న వున్నాడు. చెల్లి వుంది, తమ్ముళ్లు వున్నారు. వరంగల్ జిల్లాలో హన్మకొండ దగ్గర్లోని నర్సింహులగూడెం గ్రామంలో నాన్నకి 30 గుంటల పొలం (ఎకరంకన్నా తక్కువ) వుంది. ఊళ్లో ఎలిమెంటరీ స్కూలు వరకూ చదివించారు. అంతకుమించి చదువు నాకు అక్కర్లేదని నాన్న అనుకొంటుండేవాడు.

నాకు చదువుకోవాలని ఉంది.

నన్ను చదివించటం మీద నాన్నకి ఆసక్తిలేదు. అసలు నా మీదనే నాన్నకి ప్రేమ తక్కువ అని నాకు అనిపిస్తూ ఉండేది. చెల్లిమీద, తమ్ముడి మీద చూపించినంత

ఆ ఉత్సవాలకోసం ఇండియా రప్పించారు. "మా యూనివర్సిటీలో చదివి అమెరికాలో వ్యాపారం చేస్తున్నావ్. ఇది మా యూనివర్సిటీ ద్వారా చదివే పిల్లలందరికీ స్ఫూర్తి కలిగించే విషయం" అంటూ నా గురించి చిన్న పుస్తకం ప్రచురించి, యూనివర్సిటీ రజతోత్సవాల్లో నాకు మర్యాదలు చేశారు. నిజానికి నా అసలు పోరాటం త్వరలో ప్రారంభం కాబోతోందని అప్పటికి నాకు తెలియదు.

కంపెనీకి మళ్లీ కష్టకాలం ప్రారంభమైంది.

అదే సంవత్సరం ఎన్నికల్లో అమెరికా అధ్యక్షుడుగా ఒబామా ఎన్నికయ్యారు. అవుట్‌సోర్సింగ్ వ్యాపారంలో నియమనిబంధనలను కఠినం చేశారు. హెచ్-1 వీసాల మీద ఆంక్షలు పెంచారు.

ఈ పరిస్థితుల ప్రభావం మా కంపెనీమీద కూడా పడింది. నిజానికి ఆర్థిక సంక్షోభం కారణంగా 2008లో అనేక కంపెనీలు మూతపడిపోవటంతో సమస్య బాగా జటిలమైపోయింది. అయితే మా క్లయింట్ కంపెనీలతో వున్న సత్సంబంధాల వల్ల మేం కొంతమేరకు తట్టుకోగలిగాం. ఏమయినా దెబ్బ దెబ్బే కదా! 2008లో 28 మందికి హెచ్-1 వీసాలకోసం దరఖాస్తు చేస్తే మూడేమూడు వచ్చాయి. ఎంత పెద్ద దెబ్బ!

అప్పుడే కొత్త ప్రాజెక్టులు చేపట్టాలని నిర్ణయించాం. డెవలప్‌మెంట్ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టాం. ఈ ప్రాజెక్టులకోసం బెంగుళూరులో ఒక ఆఫీసు తెరిచి, దాని ద్వారా రిక్రూట్‌మెంట్ చేశాం. పెద్దయెత్తున చేశాం. ...ఆ దశలో నేను అనేకసార్లు బెంగుళూరు-అమెరికాల మధ్య తిరగాల్సి వచ్చేది. 'నెట్‌వర్కింగ్' చాలా అవసరమయ్యేది... కష్టం 'కష్టం' అనిపించటం లేదు. ఖర్చు 'ఖర్చు' అనిపించడం లేదు. అలవాటు పడిపోయాను. 'కెరీర్‌లో ఎదగాలంటే ఆటుపోట్లు ఎదుర్కొనే స్థైర్యం పెంచుకోవాలి' అన్నది అప్పటికే బాగా ఒంటబట్టింది.

ఈ మధ్యకాలంలో నర్సింహులుగూడెంలో ఇంటిదగ్గర పరిస్థితులు చాలా మారిపోయాయి.

అన్నయ్యకి ఒక కొడుకు పుట్టాక, 32 ఏళ్ల వయస్సులో బ్రెయిన్ ట్యూమర్ వచ్చింది. ఉస్మానియా హాస్పిటల్‌లో చేర్చారు. నా శక్తి కొద్దీ సాయం చేశాను. కాని అన్నయ్య బ్రతకలేదు. అప్పటికే అన్నయ్య కొడుకు హైస్కూలులో చదువుతున్నాడు. వాణ్ణి పెద్ద చదువులు చదివించుకునే స్తోమత వదినకి లేదు. ఆ బాధ్యత నెత్తిన వేసుకున్నాను. వాడు బి.టెక్. చదువుతున్నాడు.